# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సుస్థిర అభివృద్ధి దేశానికి మార్గదర్శక సూత్రంగా ఉండాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.
- ❖ రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్.. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో భారత్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.
- ❖ చీనాబ్ నదిపై ఉన్న బగ్లిహార్ ఆనకట్ట నుండి పాకిస్తాన్ కు నీటి విడుదలను భారత్ నిలిపివేసింది.
- ❖ సాయుధ దళాల నైతిక స్థైర్యాన్ని తగ్గించేలా కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ ఆరోపించింది.

==========================

సుస్థిర అభివృద్ధి దేశానికి మార్గదర్శక సూత్రంగా ఉండాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు. కర్ణాటక రాష్ట్రం ఉత్తర కన్నడ జిల్లాలోని సిర్సిలోని ఫారెస్ట్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఈరోజు ఆయన ప్రసంగించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సామరస్యం ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. అడవులు భూమికి ఊపిరితిత్తుల వంటివిగా అభివర్ణిస్తూ.... ఆర్థిక వ్యవస్థ, జీవావరణ శాస్త్రాలు కలసి ప్రయాణించాలన్నారు. కర్నాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌లతో కలిసి తన తల్లి జ్ఞాపకార్థం ఒక చెట్టును నాటిన ఉప రాష్ట్రపతి "ఏక్ పెడ్ మా కే నామ" ప్రచారం ప్రభావవంతమైనదని ప్రశంసించారు.

==========================

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా చీనాబ్ నదిపై ఉన్న బగ్లిహార్ ఆనకట్ట ద్వారా పాకిస్థాన్‌కు నీటి ప్రవాహాన్ని నిలిపివేసింది. సింధు నది నుండి పొరుగు దేశానికి "ఒక్క చుక్క" నీరు కూడా వెళ్లకూడదనే నిర్ణయాన్ని అనుసరించి, బగ్లిహార్ ఆనకట్ట నుండి పాకిస్తాన్‌కు నీటి ప్రవాహాన్ని నిలిపివేసినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా జీలం నదిపై ఉన్న కిషన్‌గంగా ఆనకట్ట వద్ద కూడా భారత్

ఇదేవిధమైన చర్యలు తీసుకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జమ్మూ డివిజన్ రాంబన్ జిల్లాలోని బగ్లిహార్, ఉత్తర కాశ్మీర్‌లోని కిషన్‌గంగా జలవిద్యుత్ ఆనకట్టల నీటి విడుదల సమయాల నియంత్రణ భారత్ ఆధీనంలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ సవరణ చట్టం.. పారదర్శకత, సుపరిపాలన, ప్రజా ప్రయోజనాలను అందించే లక్ష్యంతో రూపొందించబడిందని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరీటా అన్నారు. ఈరోజు ఐజ్వాల్‌లో వక్ఫ్ సుధార్ జన్ జాగరణ్ అభియాన్ వర్క్‌షాప్ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల నిర్వహణను బలోపేతం చేయడానికి వక్ఫ్ సవరణ చట్టం ఆమోదించబడిందని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై ఏర్పాటు చేసిన 31 మంది సభ్యులతో కూడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ.. 5 సంవత్సరాల వ్యవధిలో 7 వేల 772 పిటిషన్లను అధ్యయనం చేసిందని తెలిపారు. కమిటీ 38 సమావేశాలు నిర్వహించి.. 25 రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, 15 రాష్ట్ర ప్రభుత్వాలు, 5 మైనారిటీ కమిషన్లు, 20 మంది పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో సహా 284 మంది భాగస్వాములను సంప్రదించిందని చెప్పారు. అలాగే ఈ బిల్లు ఆమోదం పొందే ముందు పార్లమెంటులో 25 గంటలకు పైగా చర్చ జరిగిందని కేంద్ర సహాయ మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాయుధ దళాల నైతిక స్థైర్యాన్ని తగ్గించేలా కాంగ్రెస్ పార్టీ ప్రకటనలు చేస్తోందని.. భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి సుధాంషు త్రివేది ఆరోపించారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ... పహల్గామ్ ఉగ్రవాద దాడికి సంబంధించి కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఒకపక్క పాకిస్తాన్.. సరిహద్దులో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరంతరం ఉల్లంఘిస్తోందని, మరోవైపు ఇండియా కూటమి నాయకులు భారత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంతో ఉన్నట్టు చెబుతున్నారని.. కొంతమంది కాంగ్రెస్ నాయకులు మాత్రం దేశానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారని వివరిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ పహల్గాం ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారు. ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడిన ఆయన.. ఉగ్రదాడిలో మరణించిన వారికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ దాడికి పాల్పడిన వారిని, వారి మద్దతుదారులను న్యాయ స్థానం ముందు నిలబెట్టాలని ఆయన స్పష్టం చేశారు. కాగా.. భారత్, రష్యా దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవడానికి ఇరు దేశాల అధినేతలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ ఈరోజు తెలంగాణలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో 3 వేల 900 కోట్ల రూపాయల విలువైన వివిధ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో రహదారి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు ఉపయోగపడేలా జాతీయ రహదారుల వెంట వేలాది అమృత్ సరోవర్లను అభివృద్ధి

చేయనున్నట్టు పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం నాటికి సూరత్ - నాసిక్ - కర్నూల్ - హైదరాబాద్ - చెన్నై - తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తవుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో MICE పరిశ్రమ ప్రధాన ఆర్థిక చోదక శక్తిగా ఉండబోతోందని కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన మీట్ ఇన్ ఇండియా కాన్‌క్లేవ్ ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్ (MICE) పరిశ్రమ.. అధిక సంఖ్యలో ఉద్యోగావకాశాలను సృష్టిస్తుందన్నారు. దేశంలో MICE పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొంటూ.. దీనికి బలమైన ఆర్థిక వృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమని ఉద్ఘాటించారు. భారత్ మండపం, యశోభూమి, జియో వరల్డ్ సెంటర్ వంటి దిగ్గజ వేదికలతో పాటు మరో 10 భారతీయ నగరాలను ప్రపంచంలోని అగ్రశ్రేణి MICE గమ్యస్థానాలుగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ మహిళా కమిషన్ (NCW) ఈరోజు న్యూఢిల్లీలో 5 రోజుల మహిళా మహా జన్‌సున్వాయి శిబిరాన్ని ప్రారంభించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ కె.రహత్కర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేఖాగుప్తా మాట్లాడుతూ... జన్ సున్వాయి శిబిరం ప్రారంభించడం ఒక మంచి శుభ పరిణామమన్నారు. బాధిత మహిళలందరికీ సత్వర న్యాయం లభిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గాం ఉగ్రదాడితో భారత్ - పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సమయంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ భద్రతలో భాగంగా పౌరుల్ని సమాయత్తం చేసేందుకు ఈ నెల 7వ తేదీన మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ హోంశాఖ కొన్ని రాష్ట్రాలకు సూచించింది. భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో తెలియజేయాలని పేర్కొంది. శత్రు దాడి జరిగినప్పుడు విద్యార్థులు, పౌరులు తమను తాము రక్షించుకొనేందుకు వీలుగా స్వీయ రక్షణపై అవగాహన కల్పించాలని సూచించింది. ఎయిర్ రైడ్ హెచ్చరిక సైరెన్ల పనితీరును పరీక్షించాలని కూడా కేంద్ర హోం శాఖ ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 501 లాభాల్లో ప్రారంభమై.... చివరికి 294 పాయింట్ల లాభంతో 80 వేల 796 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 114 పాయింట్ల లాభంతో 24 వేల 461 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =